క్లుప్తంగా

హైస్కూల్‌కు కంప్యూటర్ బహూకరణ



హెచ్‌ఎం కిట్టుకు కంప్యూటర్ అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ రాఘవరావు దంపతులు

నర్సీపట్నం: శిక్షా సప్తాహ్‌లో భాగంగా గబ్బాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్య కోసం నర్సీపట్నం స్టేట్ బ్యాంక్ ప్రధాన శాఖ మేనేజర్ జె.వి. రాఘవరావు దంపతులు రూ.30 వేలు విలువ చేసే డెస్క్‌టాప్ కంప్యూటర్‌ను బహూకరించారు. దీన్ని సర్పంచ్ రాజేశ్వరి, హెచ్.ఎం సత్యనారాయణ(కిట్టు)లకు గురువారం అందజేసారు. మధ్యాహ్న భోజనం చేసే 180 విద్యార్థులకు సర్పంచ్ మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజుబాబు, ఉప సర్పంచ్ రాజునాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి



అవగాహన కల్పిస్తున్న హెల్త్ అసిస్టెంట్ రాజు

కె.కోటపాడు: అపిడమిక్ సీజన్ కావడంతో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. గురువారం సూర్రెడ్డిపాలెంలో స్టాప్ డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరుబయట మలవిసర్జన మానుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం తప్పనిసరిగా మరుగుదొడ్లు వాడాలన్నారు. అనంతరం వైద్య సేవలో భాగంగా గ్రామంలో 127 మందిని వైద్యాధికారి ధరణి పరీక్షించారు. ఎంఎల్‌హెచ్‌పీ హైమ, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాత్కాలిక మరమ్మతులతో తప్పని అవస్థలు



వర్షాలకు చిత్తడిగా మారిన బస్టాండు ఆవరణ

మాకవరపాలెం: తాత్కాలిక మరమ్మతులతో ఆర్టీసీ ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొద్దిపాటి వర్షానికే స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణ చిత్తడిగా మారుతోంది. ఏళ్ల తరబడి ఇక్కడ ఆవరణకు ఆర్టీసీ నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేస్తూ సరిపెడుతున్నారు. ఈ నేపథ్యంలో వర్షం కురిసిన ప్రతిసారీ బస్టాండులో అడుగు పెట్టేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా సారె ఊరేగింపు



ఊరేగింపుగా సారె తీసుకెళ్తున్న మహిళలు

గొలుగొండ: గొలుగొండలో దుర్గాదేవికి భక్తులు గురువారం సాయంత్రం చీర, సారె సమర్పించారు. తొలుత గ్రామంలో మహిళలంతా ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. తమకు తోచిన పిండి వంటలు, చీరలు, కానుకలు అమ్మవారికి సమర్పించారు. ప్రతీ గ్రామంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సమరసత సేవా ఫౌండేషన్ కమిటీ సభ్యులు తెలిపారు. యమన యూత్ సభ్యులు, రామాలయ భజన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ధర్నా

అనకాపల్లి: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌వో ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ మాట్లాడుతూ గాంధీనగర్ ఎస్సీ కాలేజీ హాస్టల్‌కు కొత్త భవనాలు నిర్మించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్ని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854,
7997958336

ఆటపాటలతో సందడి

• అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు • సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్న విద్యార్థులు • పాఠశాలల్లో వేడుక



బహుమతులు అందిస్తున్న ఎంఈవో మూర్తి



రోలుగుంట పాఠశాలలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

చోడవరం రూరల్: శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు రోజు వారీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సందడిని నింపుతున్నాయి. సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దం పడుతున్నాయి. విద్యార్థుల ఆటపాటలు, వేషధారణలు సహ విద్యార్థులను, ఉపాధ్యాయుల్లోను ఉల్లాసాన్నిస్తున్నాయి. సప్తాహ్‌లో భాగంగా గురువారం మండలంలోని అన్ని పాఠశాలల్లో సాంస్కృతిక దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు అచ్చ తెలుగు, స్వచ్ఛ స్వాతంత్ర్య, భారతమాత వేషధారణలతో పల్లె ప్రజలను పులకరింపచేస్తున్నారు. అడ్డూరు పాఠశాల ప్రధానోపాధ్యాయిని చైతన్య నేతృత్వంలో విద్యార్థులు పలు వేషధారణలతో అలరించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు భరతమాతను, దేశంలోని మూడు ప్రధాన మతాల పెద్దలను సహ విద్యార్థుల ముందుంచారు. విద్యార్థినుల కోలాట ప్రదర్శన అలరించింది. ఎంఈవో జయలక్ష్మి స్వయంగా వీక్షించి వీరిని అభినందించారు. హెచ్‌ఎం ఎం.పాండురంగారావు, ఉపాధ్యాయుల కృషిని మెచ్చుకున్నారు. సీవీఆర్‌పి కె.వి.మహాలక్ష్మినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పగటి వేషాలు

మాకవరపాలెం: శిక్షా సప్తాహ్‌లో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని దేశంలో వివిధ ప్రాంతాల భాషలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను గౌరవించేలా నృత్యాలు ప్రదర్శించారు. ఉత్తమ శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఇచ్చిన పదో తరగతి విద్యార్థి శ్రీభవ్యతోపాటు మరికొందరు విద్యార్థులకు ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి హెచ్‌ఎం అచ్యుతరామయ్య బహుమతులు అందజేశారు. రాజ్యాంగ పీఠికను వివరించారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మిఠాయిలు అందించారు. దాతలు ఎవరైనా విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు అందజేయాలని హెచ్‌ఎం కె.రాము విజ్ఞప్తి చేశారు.



చోడవరం ప్రభుత్వ పాఠశాలలో కోలాటం ఆడిన వారిని అభినందిస్తున్న ఎంఈవో జయలక్ష్మి



అడ్డూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థుల వేషధారణలు

రోలుగుంట: శిక్షా సప్తాహ్‌లో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం డి.ఎస్.ఎస్. ప్రసాద్, ఇంగ్లిష్ టీచర్ జ్యోతిర్మయి, పీడీ గోవిందరావు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యార్థులకు గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మండలంలో కె.జె.పురం, వీరనారాయణం, ముకుందపురం, ఎం. కోటపాడు, ఎం. కోడూరు, వంటర్లపాలెం, తదతర పాఠశాలల్లో సంప్రదాయ నృత్యాలతో విద్యార్థులు అభినయించారు. ఈ కార్యక్రమాలను ఎంఈవో దేముడమ్మ పర్యవేక్షించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు



ఎ. కొత్తపల్లిలో ఆధార్ నమోదు శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పలరాజు



జె.డి.పేటలో ఆధార్ నమోదు ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజారామ్

దేవరాపల్లి: ప్రజల చెంతనే ఆధార్ సేవలను అందించడమే లక్ష్యంగా గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశామని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్. అప్పలరాజు తెలిపారు. గురువారం ఎ. కొత్తపల్లిలో సచివాలయంలో ఆధార్ నమోదు శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. షెడ్యూల్ ప్రకారం ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహించి అలసత్వం వహించకుండా పారదర్శకంగా సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ఆధార్ శిబిరాల్లో కొత్త ఆధార్ నమోదుతోపాటు పేర్లు మార్పు, బయోమెట్రిక్ అప్‌డేట్, డాంక్యుమెంట్ అప్‌డేట్ తదితర సేవలను అందిస్తున్నారన్నారు. ఈ సేవల కోసం పాన్‌కార్డు, ఓటరు కార్డు, జనన ధ్రువీకరణ, పదో తరగతి మార్కుల లిస్టు తదితర పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

జె.డి.పేటలో ఆధార్ నమోదు

మాడుగుల: జె.డి.పేట సచివాలయంలో ఆధార్ మొబైల్ క్యాంపును ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేయించుకోవాలని, 18 ఏళ్లు నిండిన వారంతా అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ కోశిరెడ్డి కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి వెత్సా రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోర్లు ప్రారంభం

నాతవరం: మారుమూల గ్రామాల ప్రజల తాగునీటి సమస్య తీర్చడమే లక్ష్యమని నాసా స్వచ్ఛంద సేవా సంస్థ మండల కోఆర్డినేటరు టి.శ్రీను తెలిపారు. వెదురుపల్లి పంచాయతీ శివారు కొడవటిపూడి అగ్రహారం, డి.యర్రవరం పంచాయతీ శివారు యరకంపేట గ్రామాల్లో నాసా స్వచ్ఛంద సేవా సంస్థ సొంత నిధులతో బోర్లు ఏర్పాటు చేసింది. వీటిని షేబా సంస్థ డైరెక్టరు కులపతి వైజరు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులతోపాటు స్వచ్ఛంద సేవా సంస్థలు సేవా కార్యక్రమాలు చేస్తేనే ఆశించిన విధంగా సమాజాభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో డి.పి.ఐ.ఎస్. జిల్లా నాయకుడు కొండ్రు మరిడియ్య, నాసా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి వెంకటరత్నం, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



బోరు ప్రారంభిస్తున్న షేబా సంస్థ డైరెక్టరు కులపతి వైజరు

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అల్లరి మూకలపై ఫిర్యాదు



ఎస్సైలకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నర్సీపట్నం: ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అల్లరి మూకల వికృత చేష్టలను అరికట్టాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గీతాకృష్ణ, తదితరులు టౌన్ ఎస్సైలు సుధాకర్, ఉమామహేశ్వరావుకు గురువారం ఫిర్యాదు చేశారు. కళాశాలల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే విద్యార్థినుల పట్ల ఆర్టీసీ కాంప్లెక్స్ అల్లరి మూకలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. విద్యార్థులపై దాడులు సైతం చేస్తున్నారని, రక్షణ కల్పించాలని ఎస్సైలను కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ కోరారు. ఈ మేరకు డీఈవో కార్యాలయంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెం.117ను రద్దుచేసి, జీవో ఎంఎస్ నెం.55 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీతోపాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని కోరారు. హైస్కూళ్లలో రెండు మాధ్యమాలను సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులను బోధ నేతర పనుల నుంచి మినహాయించి, పని భారం తగ్గించాలని, హైస్కూళ్లలో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని నివేదించారు. స్థానిక ప్రాంతాల పరిస్థితుల ఆధారంగా మధ్యాహ్న భోజనం మెనూ సవరించాలన్నారు. మునిసిపల్ టీచర్ల పీఎఫ్ సమస్య, కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు జరపాలని విన్నవించారు. వీటితోపాటు ఉపాధ్యాయులు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను విన్నవించారు. జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయ్

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం సబ్ స్టేషన్‌లో మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.డి.రామకృష్ణారావు తెలిపారు. బలిఘట్టం, బయపురెడ్డిపాలెం ప్రాంతాల్లో వినియోగదారులు సహకరించాలని సూచించారు.

మాకవరపాలెం: కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని భీమబోయినపాలెం, రామన్నపాలెం ఫీడర్లలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని డీఈ రామకృష్ణ తెలిపారు. లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శెట్టిపాలెం, భీమబోయినపాలెం, జడ్.గంగవరం, రామన్నపాలెం, జి.వెంకటాపురం పంచాయతీల పరిధి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

బుచ్చెయ్యపేట: వడ్డాది విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బంగారుమెట్ట, బుచ్చెయ్యపేట లైన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

పొంగలిపాకలో పారిశుధ్య పనులు



తుప్పలు తొలగిస్తున్న గ్రామస్తులు

మాడుగుల: పొంగలిపాకలో గురువారం గ్రామ పెద్దలు పారిశుధ్య పనులు చేపట్టారు. ఉండూరు దేముడు, నాయన సత్యనారాయణ, ఉండూరు, భాస్కరరావుల ఆధ్వర్యంలో ఇంటికి ఒక్కరు చొప్పున స్వచ్ఛందంగా తరలివచ్చి వీధుల్లో చెత్తాచెదారాలు తొలగించారు. తాగునీటి బోర్లు, కుళాయిల వద్ద పరిశుభ్రంగా తయారు చేశారు. క్రిమికీటకాలు వల్ల రోగాలు దరి చేరకుండా గ్రామమంతా శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శి పద్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మునగపాక: వర్షాల కారణంగా నారు మడులు మునిగి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ టీయూ మండల కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ కోరారు. మండలంలోని అరబుపాలెం సచివాలయంలోని అధికారులకు ఈ మేరకు గురువారం వినతి అందజేశారు.

తహసీల్దార్‌కు ఘన సత్కారం



తహసీల్దార్ శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న అధికారులు

బుచ్చెయ్యపేట: స్థానిక తహసీల్దార్ శ్రీకాంత్‌కు రిలీవ్ అయింది. శ్రీకాకుళం నుంచి బుచ్చెయ్యపేట ఎన్నికల విధులకు వచ్చిన ఆయన్ని తిరిగి తన సొంత ప్రాంతానికి ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఈ మేరకు తహసీల్దార్ శ్రీకాంత్‌ను గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అరుణ్‌చంద్ర, ఎంపీడీవో వెంకటాచార్య, ఎస్ఐ ఈశ్వరరావు, ఆర్ఐ శ్రావణ్, వీఆర్వోలు సుధాకర్, నాగరాజు సత్కరించారు. ఎన్నికల విధులు సంక్రమంగా నిర్వహించిన అధికారులను ఈ సందర్భంగా తహసీల్దార్ అభినందించారు.

ముందు జాగ్రత్తలతో వ్యాధులు దూరం

కె.జె.పురం వైద్యాధికారి లీలాప్రసాదు



మాడుగుల రూరల్: ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు వల్ల గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయని, ఈ సమయంలో తగు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె. లీలాప్రసాదు సూచించారు. గురువారం ఆయన కె.జె.పురం పీహెచ్‌సీలో మాట్లాడారు. వర్షాల్లో తడవడం వల్ల జ్వరాలు, గొంతునొప్పి, దగ్గు జలుబు వస్తుంటాయన్నారు. ముందస్తుగా ప్రతి ఒక్కరూ వేడి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కలుషిత నీటిని తాగడం వల్ల డయేరియా, జిగట విరేచనాలు, కామెర్లు, వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. వీటి నివారణకు ముందస్తుగా కాచి చల్లార్చిన నీటిని తాగడం వల్ల పైన పేర్కొన్న వ్యాధులు వ్యాప్తి చెందవన్నారు. చిన్నారులను బయట గాలిలో తిప్పడం వల్ల న్యూమోనియా వ్యాప్తి చెందుతుందన్నారు. జ్వరం, గొంతువాపు, వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వైరల్ జ్వరం వస్తే సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా గ్రామ సచివాలయంలో ఏఎన్‌ఎంను కలిసి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, వంటి పరీక్షలు అన్ని పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేస్తారన్నారు. గ్రామాల్లో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు కాలువల్లో దోమలు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. మంచినీటి ట్యాంకులను పంచాయతీ సిబ్బంది సహకారంతో క్లోరినేషన్ చేయించాలన్నారు. వేడి ఆహారం తీసుకోవాలన్నారు. ఆహార పదార్థాలపై మూతలు పెట్టాలన్నారు. ఈగలు వాలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరుబయట విక్రయించే తినుబండారాలను తీసుకోవడం వల్ల డయేరియా వంటి వ్యాధి ప్రబలే అవకాశం ఉందన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక దృష్టి

మాకవరపాలెం: పారిశుధ్యం మెరుగుకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి సూచించారు. మండలంలోని బూరుగుపాలెం, పైడిపాల, మాకవరపాలెంలో డ్రైనేజీల్లో పూడిక, తుప్పల తొలగింపు పనులను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చూడాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఎక్కడబడితే అక్కడ చెత్త వేయొద్దన్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లోనే చెత్తను వేస్తూ పంచాయతీలకు సహకరించాలన్నారు. పరిసరాలతోపాటు ఇంటి ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు.



బూరుగుపాలెంలో పూడిక తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ

ఆమె వెంట బూరుగుపాలెం సర్పంచ్ బొబ్బిలరెడ్డి వెంకటరమణ, కార్యదర్శులు గంగరాజు, బాలదొర ఉన్నారు.

నారుమడుల్లో సస్యరక్షణ చేపట్టాలి



పొడతెగులు ఆశించక ముందు, ఆశించిన వరినారుమడి

రోలుగుంట: వరి నారుమడుల్లో ప్రారంభ దశలోనే సస్యరక్షణతో తెగుళ్లు నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్ విజయలక్ష్మి రైతులకు సూచించారు. పది రోజులుగా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వరి నారుమడుల్లో నీరు చేరడం, నిల్వ ఉండటం వల్ల చల్లటి వాతావరణానికి తెగుళ్లు ఆశించాయి. వీటిని తమ సిబ్బందితో కలిసి ఆమె ఇటీవల పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ మేరకు రైతులు రోలుగుంట, పడాలపాలెం, తదితర గ్రామాల్లో నారుమడుల సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. నీరుపోయే అవకాశం లేని మడుల్లో పొడ తెగులు ఆశించి ప్రారంభ దశలో ఉంది. దీనిపై ఆందోళన చెందొద్దని వ్యవసాయాధికారి సూచించారు.

వీటిని ధాతు లోపంగా గుర్తించి లీటరు నీటికి 20 గ్రాముల చొప్పున మిశ్రమం చేసి అన్నభేదితో పాటు ట్యాంకు నీటికి ఒక నిమ్మకాయ రసం కలపి పిచికారీ చేసి నివారించుకోవాలన్నారు. లేత ఆకులు ఒకట్రెండు ఆకుపచ్చగా ఉండి మొదళ్ల ఆకులు రంగు మారితే చౌడు ప్రభావంగా భావించుకోవాలన్నారు. 19.19.19 పిచికారీ చేస్తే సరిపోతుందన్నారు.

ఆర్సీఎం పాఠశాల పూర్వ హెచ్‌ఎం మృతి

మాజీ ఎం.పి. భీశెట్టి వెంకటసత్యవతి సహా పలువురు సంతాపం



సిస్టర్ ట్రీసాన్ (ఫైల్)

మాడుగుల రూరల్: స్థానిక ఆర్సీఎం పాఠశాలలో 18 సంవత్సరాలపాటు ప్రధానోపాధ్యాయినిగా పనిచేసి, ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దిన సిస్టర్ ట్రీసాన్ మృతి చెందారు. గురువారం విశాఖలోని తన స్వగ్రహం మల్కాపురంలో మరణించడంతో ఉపాధ్యాయులు, మాడుగుల గ్రామస్తులు సంతాపం తెలిపారు. కేరళలో జన్మించిన ఈమె మాడుగుల ఆర్సీఎం పాఠశాలలో 1974 సంవత్సరం నుంచి గణితం, ఇంగ్లిషు సబ్జెక్టులు విద్యార్థులకు బోధించేవారు. అనంతరం ప్రధానోపాధ్యాయినిగా పనిచెయ్యడమే కాకుండా, సెయింట్ ఆన్స్ సుపీరియర్, సెయింట్ ఆన్స్ ప్రొవిన్సియర్ జనరల్‌గా రెండు సార్లు కౌన్సిలర్‌గా అనేకమైన ఉన్నతమైన పదవులు చేపట్టారు. పదవీ విరమణ తర్వాత విశాఖ సిటీలో నివాసముంటున్నారు. ఆమె దగ్గర అనకాపల్లి మాజీ ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, డి.ఆర్.యు.సి.సి సభ్యుడు శ్రీనాథు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, విశ్రాంత ఉపాధ్యాయులు కోడూరు కొండలరావు, డాక్టర్ రాజేశ్వరి, ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరావు, డాక్టర్ ద్రాక్షారపు అప్పారావు, విశ్రాంత ఎస్ఐ షేక్ యూసబ్, ఐసీడీఎస్ సీడీపీవో షాహిని పద్మ, బసవ పరమేష్, ఇలా ఎంతో మంది విద్యనభ్యసించి ఉన్నత స్థాయుల్లో స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో సిస్టర్ ట్రీసాన్ మృతి పట్ల వీరంతా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ నెల 27న ఆమె మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గ్రామాల పరిశుభ్రంతోనే ఆరోగ్యం

గొలుగొండ: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రత్నకుమారి తెలిపారు. ఆమె గురువారం ఏఎల్‌పురంలో రోడ్లు, డ్రైనేజీ, శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డును పరిశీలించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేశారు. గ్రామంలో పారిశుధ్య సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెత్తను సేకరించి సేంద్రియ ఎరువు తయారీ చేయాలన్నారు. తద్వారా పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. మురుగు నిల్వ లేకుండా చూడాలని, తాగునీరు సక్రమంగా అందాలని ఆయా శాఖల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రమణి, సర్పంచ్ లోచల సుజాత, కార్యదర్శి శ్రీనువాస్ పాల్గొన్నారు.



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో, సర్పంచ్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com